
సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



## భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప పెద్ద దర్గా ఉరుసు బుధవారం ప్రారంభమైంది. హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్‌ఖాద్రీ ఉరుసు తొలిరోజు కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ ఇంటి నుంచి గంధం కలశంతో దర్గాకు చేరారు. అనంతరంగంధాన్ని గురువుల మజార్ వద్ద సమర్పించారు. -కడప కల్చరల్

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /25.6

జిల్లాలో బుధవారం 25.6 – 32.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

# సంక్షోభ హాస్టళ్లు!

అక్కడ మరుగుదొడ్లు ఉంటాయి.. తలుపులు ఉండవు.. బాత్‌రూంలో కుళాయిలు ఉంటాయి... నీళ్లే రావు.. రాత్రిళ్లు నడుంవాల్చగానే పెచ్చులూడిన పైకప్పులు భయపెడతాయి.. ఇక పగిలిన కిటికీల అద్దాల నుంచి దోమలు రాత్రంతా దాడి చేస్తూనే ఉంటాయి. పేరుకే అవి సంక్షేమ హాస్టళ్లు.. నిజానికవి అవస్థలకు నకళ్లు. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి సంక్షోభంలో చిక్కుకుపోయాయి. నెలలు గడుస్తున్నా దుప్పట్లు రాక పిల్లలు ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. నీళ్లు..నిద్ర కరువై అల్లాడుతున్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

- హాస్టళ్లలో సమస్యల తిష్ట
- విద్యార్థులకు అందని దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు
- కొరవడిన మౌలిక సదుపాయాలు



ప్రొద్దుటూరు కల్చరల్: మోడంపల్లె ఎస్సీ హాస్టల్‌లో దుప్పట్లు లేకుండానే నిద్రపోతున్న విద్యార్థులు




జమ్మలమడుగు: మహిళా హాస్టల్‌లో పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన దృశ్యం

### ఇదేనా.. వసతి!

కమలాపురం: పేరుకే సంక్షేమ వసతి గృహాలు.. ఆచరణలో మాత్రం సంక్షేమం ఉండదు.. వసతులూ ఉండవు.. అరకొర వసతుల నడుమ విద్యార్థులు అవస్థలు పడుతూ తమ విద్యను కొనసాగిస్తూ వస్తున్నారు. కమలాపురం పట్టణంలోని వసతి గృహాలే దీనికి నిలువెత్తు సాక్ష్యం. నియోజకవర్గ కేంద్రమైన కమలాపురం పట్టణంలో ఐదు వసతి గృహాలు ఉన్నాయి. అందులో బీసీ కళాశాల బాయ్స్ హాస్టల్ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ హాస్టల్‌లో 45 మంది విద్యార్థులు ఉంటున్నారు. భవనం పాతది.. పైగా కిటికీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పలు కిటికీలకు రెక్కలు లేవు. మరి కొన్ని కిటికీలకు మెష్ లేదు. వర్షం వస్తే నీరంతా గదుల్లోకి వస్తోందని, అలాగే రాత్రిళ్లు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మెనూ సైతం అంతంత మాత్రమే ఉందని విద్యార్థులు అంటున్నారు.



బీసీ కళాశాల బాయ్స్ హాస్టల్‌లో అద్దాలు పగిలిన కిటికీలు



రెక్కలు లేని కిటికీలు

- బీసీ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లోనూ అరకొర వసతులే ఉన్నాయి. వసతులు లేక పోతే ఎలా ఉండాలని ఇక్కడి విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. హాస్టల్ కోసం పక్కా భవనం నిర్మించాలని బాలికలు కోరుతున్నారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో పక్కా భవనంలో కొనసాగుతోంది. అన్నం అపుడపుడు ఉండలుగా ఉంటోందని, ప్రభుత్వం స్పందించి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ఇక్కడి విద్యార్థినులు కోరుతున్నారు.

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ,ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ వేలాది మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టళ్ల ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం... అధికార యంత్రాగంపై ఉంది. క్షేత్ర స్థాయిలో ఇటు అధికారుల అలసత్వం.. అటు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హాస్టళ్లలో సమస్యలు పేరుకుపోతున్నాయి.

**సమస్యలతో స్వాగతం...**

జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ వసతి గృహాల్లోని ప్రీ మెట్రిక్ (3 నుంచి 10వ తరగతి) విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు ఇవ్వాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా ఇంతవరకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు అందలేదు. అసలే వర్షాకాలం... ఆపై దోమల దండయాత్ర కూడా మొదలైంది. దీంతో కొందరు విద్యార్థులు వారు ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లను తమ దోస్తులతో పంచుకుంటున్నారు. అలాగే ఉన్న ప్లేట్లు, గ్లాసులతోనే సర్దుబాటు చేసుకుంటున్నారు.

- కమలాపురం బీసీ హాస్టల్‌లో కిటికీలు లేకపోవడంతో రాత్రి పూట విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- మైదుకూరు నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ హాస్టళ్లలోని ప్రాంగణాలలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ బాలుర హాస్టల్ విద్యార్థులకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.
- ఎస్సీ వసతి గృహాలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో 54 వసతి గృహాలకుగాను చాలా వాటిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. ఇంకా 10 వసతి గృహాల్లో మౌలిక వసతులకు సంబంధించి మరమ్మతులను చేపట్టాల్సి ఉంది.
- జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఎస్సీ హాస్టల్‌లో కిటికీలు లేవు. మరికొన్ని చోట్ల నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది.
- చెన్నూరు ఎస్సీ హాస్టల్‌లో నీటి కొరత ఏర్పడింది.
- ప్రొద్దుటూరు పరిధిలోని మోడంపల్లె ఎస్సీ హాస్టల్ పాడిబడిన భవనం కావడంతో పెచ్చులూడుతోంది.

**జిల్లాలోని హాస్టళ్ల వివరాలు**

| శాఖ | విభాగం | హాస్టళ్లు | విద్యార్థులు |
|---|---|---|---|
| ఎస్సీ | ప్రీ మెట్రిక్ | 53 | 5,243 |
| | పోస్ట్ మెట్రిక్ | 14 | 1,610 |
| బీసీ | ప్రీ మెట్రిక్ | 31 | 2,194 |
| | పోస్ట్ మెట్రిక్ | 14 | 1,027 |
| ఎస్టీ | ప్రీ మెట్రిక్ | 01 | 150 |
| | పోస్ట్ మెట్రిక్ | 02 | 250 |
| | రెసిడెన్షియల్ | 05 | 604 |

**గురుకులాల్లోనూ అంతే..**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల్లో కూడా అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో బాలికలకు దుస్తులు శుభ్రపరుచుకునేందుకు గదులు లేక ఆరుబయట దుస్తులను శుభ్రం చేసుకుంటున్నారు. డైట్ బిల్లులు అందడం లేదని హెచ్‌డబ్ల్యూఓలు ఆరోపిస్తున్నారు.



మరుగుదొడ్లు లేక ఆరుబయట మూత్ర విసర్జన చేస్తున్న విద్యార్థులు

పులివెందుల మండలంలోని కడప రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది. గదులకు తలుపులు సరిగా లేవు. మరుగుదొడ్లలో దుర్వాసన వెదజల్లుతుండటంతో విద్యార్థులు మూత్ర విసర్జనకు బయటికి వెళ్తున్నారు. తరగతి గదులు కూడా నెర్రలు చీలి పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. -పులివెందుల రూరల్

### దోమలు ఎక్కువగా ఉన్నాయి



దోమల బెడద ఎక్కువగా ఉంది. కిటికీలకు నెట్ లేదు. దోమల తాకిడికి విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం నేను జ్వరంతో ఉన్నా–నరసింహులు, విద్యార్థి, ఎస్సీ హాస్టల్, ప్రొద్దుటూరు

### విద్యార్థుల సౌకర్యాల కల్పనకు చర్యలు



కలెక్టర్ శివశంకర్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు చేపడుతున్నాం. – సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ



ప్రొద్దుటూరు కల్చరల్: దెబ్బ తిన్న బాత్రూం తలుపులు



బద్వేలు అర్బన్: శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్న బీసీ బాలుర వసతిగృహం పైకప్పు

### క్షణక్షణం.. భయం భయం

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలో 2 ఎస్సీ బాలుర, 2 ఎస్సీ బాలికల, ఒక బీసీ బాలుర, ఒక బీసీ బాలికల కళాశాల, ఒక ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో సుమారు 627 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. దీంతో వసతిగృహంలోని వంటగది, మరో నాలుగు గదులను మూసివేశారు. ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం, బీసీ కళాశాల బాలికల వసతిగృహం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వసతి గృహాలకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ కష్టతరమవుతుందని వార్డెన్లు వాపోతున్నారు.

- కాశినాయన మండలంలో ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. 100 మంది విద్యార్థులు ఉన్నారు. 100 మందికి ఒకే బాత్‌రూం , ఒకే లెట్రిన్ ఉన్నాయి. పడుకునేందుకు కూడా విద్యార్థులు సరైన వసతి లేదు.
- అట్లూరు మండల పరిధిలోని బీసీ బాలుర హాస్టలు వసతులు అధ్వాన్నంగా ఉన్నాయి. నీటి సరఫరా లేకపోవడంతో మరుగుదొడ్లు మరుగున పడ్డాయి. బాతురూములలో బకెట్ నీరు కూడా లభించదు. స్నానపు గదులలో కుళాయిలు కూడా లేవు. దీంతో విద్యార్థులు ఆరు బయటకే వెళ్ల వలసి వస్తుంది. 'సాక్షి' విజిట్ చేసిన సమయంలో వార్డన్‌తో పాటు వంటమనిషి అందు బాటులో లేరు వాచ్‌మెన్ ఒకడు మాత్రమే మద్యం మత్తులో ఉన్నాడు. వివరాలు అడిగితే సమాధానం చెప్పలేని దుస్థితి నెలకొంది.

ఖాజీపేట: ఖాజీపేట టౌన్‌లో ఉన్న ఇంటిగ్రేడ్ హాస్టల్‌లో పరిస్థితి దయనీయంగా ఉంది. మరుగుదొడ్లుకు పూర్తిగా డోర్లు లేవు.. డోర్లు లేకుండానే విద్యార్థులు మరుగుదొడ్లను వాడుతున్నారు..ఇక విద్యార్థుల గదుల వాకిళ్లు పూర్తిగా దెబ్బతిని విగిపోయి ఉన్నాయి.. అప్పనపల్లె హాస్టల్‌లో సైతం మరుగుదొడ్లకు తలుపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టళ్లలో 50 ఫ్యాన్లు ఉండాల్సి ఉండగా అందులో 30 కి పైగా ఫ్యాన్లు పనిచేయడం లేదు..

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు మండలంలో 7 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, 5 బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. పొట్టిపాడు రోడ్డులోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం-2లో దోమల బెడద ఎక్కువగా ఉంది. దీంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. బాత్రూంలకు తలుపులు తుప్పుపట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. బాత్రూంలలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు హాస్టల్ బయట కొళాయి వద్ద స్నానాలు చేస్తున్నారు. ఎస్సీ కళాశాల హాస్టల్ గదుల రిపేరు చేస్తుండటంతో గత కొన్ని నెలలుగా కళాశాల విద్యార్థులు కూడా బాలుర వసతి గృహంలోనే ఉంటున్నారు. మోడంపల్లె ఎస్సీహాస్టల్-1లో పెచ్చులూడుతున్నాయి.



అట్లూరు బీసీ హాస్టల్‌లో కుళాయిలు లేని దృశ్యం



ప్రొద్దుటూరు కల్చరల్: దెబ్బతిన్న గోడలు



మైదుకూరు బాలుర హాస్టల్‌లో విద్యార్థుల స్నానాలిక్కడే..



కాశినాయన: 100 మంది విద్యార్థులకు ఒకే బాత్‌రూమ్



బద్వేలు అర్బన్‌బీసీ వసతిగృహంలో ఒకే దుప్పటిని నలుగురు విద్యార్థులు కప్పుకున్న దృశ్యం



ఖాజీపేట: తలుపులు లేని మరుగుదొడ్లు

## న్యూస్‌రీల్

### నేడు ఉపాధ్యాయులకు సన్మానం

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజును పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను నేడు సన్మానించనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 79మందిని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేశారు. వారందరికీ గురువారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేసి సన్మానించనున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

### నేటి నుంచి అవగాహన సదస్సులు

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు ఆశించే తెగుళ్లు.. వాటి నివారణ.. యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం నుంచి 13వ తేదీ వరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులతోపాటు క్షేత్ర సందర్శనలకు కడప వ్యవసాయ వనరుల కేంద్రం అధికారులు, కృషి విజ్ఞానకేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తల బృందం హాజరువుతుందని తెలిపారు. 5వ తేదీ పులివెందుల డివిజన్, 6న కమలాపురం, 9న కడప, 10న పోరుమామిళ్ల, 11న ముద్దనూరు, 12 మైదుకూరు,13 ప్రొద్దుటూరు డివిజన్లలో సదస్సులు జరుగుతాయని వెల్లడించారు.

# సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్

**కలెక్టర్ శివశంకర్**

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ సబ్సిడీతో గృహాలకి ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ నెలకొల్పుటకు పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బీజిలీ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూంలో ఈ పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ సామర్థ్యం 1 కిలో వాట్ కు నెలకు 120 యూనిట్ల చొప్పున వినియోగదారునికి ఏడాదికి రూ.8000లు ఆదా అవుతుందని తెలిపారు. 2 కిలో వాట్ల కు నెలకు 240 యూనిట్ల చొప్పున ఏడాదికి రూ 20,000, మూడు కిలో వాట్ల కు నెలకు 360 యూనిట్ల చొప్పున ఏడాదికి రూ.32,400 ఆదా అవుతుందని తెలిపారు. ఒక కిలో వాట్ కింద 30 వేలు, 2 కిలో వాట్స్ కింద 60 వేలు, త్రీ కిలోవాట్స్ కింద 78వేలు ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని వెల్లడించారు. ఇంటి పైకప్పు పైన కనీసం 10 చ. మీ./ 100 చదరపు అడుగుల స్థలములో ఒక కిలో వాట్ ప్లాంటుని ఏర్పాటు చేయవచ్చునని తెలిపారు. దీనికోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. పీఎంసూర్యఘర్.జీఓవీ.ఇన్‌లో రిజిస్టర్ చేసుకొని ప్రభుత్వ రాయితీ ద్వారా గృహ వినియోగదారులు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు.



పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన పథకం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**ఆదర్శ సోలార్ గ్రామాన్ని ఎంపిక చేదం**

జిల్లాలో ఏడు గ్రామాలను ఎంపిక చేసి అందులో 5 గ్రామాలని ఖరారు చేసి, ఈ 5 గ్రామాలలో 6 నెలల పాటు పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బీజిలి యోజన పథకాన్ని అమలుపరుస్తామన్నారు. 6 నెలలు గడిచిన తరువాత ఎక్కువ సోలార్ అమలు జరిగిన గ్రామాన్ని ఆదర్శ సోలార్ గ్రామంగా జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. అనంతరం పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బీజలి యోజన పథక పోస్టర్ను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు.

**అటవీ ప్రాంతాన్ని సంరక్షించాలి**

జిల్లాలోని అటవీ ప్రాంతాలను, వన్య ప్రాణులను సంరక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని ప్రజా వినతుల స్వీకరణ వేదిక హాలులో డిస్ట్రిక్ ఫారెస్ట్ వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ ప్రాంతాలలో టూరిజం స్పాట్లను గుర్తించి అభివృద్ధి చేయాలని తెలిపారు. ఆయా టూరిజం స్పాట్లలో పర్యాటకులు సందర్శించే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అలాగే కడప నగరవనాన్ని మరింత అభివృద్ధి చేసే విషయమై అధికారులను అడిగి తెలుసుకున్నారు.


### బీసీ భవన్ ఆదర్శంగా నిలవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప బీసీ భవన్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. బుధవారం పాత రిమ్స్ ఆవరణలోని బీసీ భవన్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూల నుంచి బీసీలు ఇక్కడికి వస్తారని వారికి అన్ని సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా బీసీ భవన్ అభివృద్ధికి కలెక్టర్ రూ. 6 లక్షల విరాళంగా ప్రకటించడం విశేషం. బీసీ సంక్షేమ అధికారి ఎం భరత్ కుమార్ రెడ్డి, బీసీ కుల సంఘాల నాయకుల బత్తల లింగమూర్తి, గోవిందు నాగరాజు, ములకాని త్రివిక్రమ్ యాదవ్, ఎం.శ్రీనివాసులు, ఖాదర్ బాషా, నటరాజ్ పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం లెక్కింపు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఉన్న హుండీల ఆదాయాన్ని (పరకామణి) బుధవారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. హుండీల మొత్తం ఆదాయం రు.37,10.681 లు వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇందులో ఆలయంలోని హుండీల ద్వారా 36,48,364లు రాగా అన్నదాన సత్రం లోని హుండీ ద్వారా రు.63,317లు వచ్చిందన్నారు.అలాగే 17 మిల్లీ గ్రాముల బంగారంతో పాటు 2కిలోల వెండా వస్తువులు వచ్చినట్లు తెలిపారు. కడప దేవదాయ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ రమణమ్మ,ఆలయ ప్రధాన,ఉప ప్రధాన అర్చకులు కేసరి,రాజా రమేష్ పాల్గొన్నారు.

### స్టేషన్ ఆహ్లాదకరంగా ఉండాలి: ఎస్పీ



అట్లూరు పోలీసుస్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

అట్లూరు: పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలు పోలీసులంటే భయపడకూడదని, పోలీసుస్టేషన్ ఆవరణ పారిశుధ్యంతో పాటు ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం అట్లూరు పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు ఎస్పీ వెంకటరాముడు, స్థానిక ఇన్‌చార్జి ఎస్ఐ కె.సి.రాజు పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలోని కోదండ రామాలయంలో బుధవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు.